# స్వర్ణ గౌరి

### శ్రీమతి కాంచనపల్లి చూడామణిగారు

సరస్వతీనదీతీరమున విమలయను నొక నగరరాజముగలదు. ఆనగరాధిపతి యగు చంద్రప్రభువను వానికి మహాదేవి, విశాలాక్షి యను యిరువురు భార్యలుగలరు. ప్రథమభార్యయగు మహాదేవి యణకువగల ప్రేమాస్పదమైన సహచారిణియై పట్ట మహాదేవి యను నామమును సార్థకపరచుచుండెను.

ఇట్లుండ ఒకానొక దినసంబున విమలాధిపతి విహారార్థమురుగ మధ్యేమార్గమున దారి కడ్డముగ పక్షులచేతను, విహంగకన్యకలచేతను పరివేష్టింపబడిన పద్మపూరిత సరోవరంబొండు గాంచి, విహంగకన్యకలు ఆపద్మముల నారాధించుచున్నటుల తెలిసి కొనెను. అంత పృథ్వీపతి సంభ్రమాశ్చర్యానందపరవశుడై ఆకన్యకల "మీరేమిటా యారాధించుచున్నది?" యని ప్రశ్నింప అదియొక వ్రతమనియు, దానిపేరు "స్వర్ణగౌరీ" వ్రతమందురనియు, కైలాసనాథుని అర్ధాంగియగు గిరిసుతయొక్క అపరావతారమనియు, ఐశ్వర్యప్రసాదినియనియు నుడివిరి. అనంతర మాభూరమాపతి ఆవ్రతవివరముల సశేషరహితముగ వినిపింప ప్రార్థించెను. "శ్రావణశుద్ధతదియ మొదలుగ పదునారువత్సర ములు యేకదీక్షగ యీవ్రత మెవ్వరు శ్రద్ధాభక్తులతో నాచరింతురో వారలకు తప్పక ఐశ్వర్య మొనఁగూడు"నని వారలు చెప్ప అందులకు రాజువల్లెయని వారలచేత పదహారు దారములు కలిపి పేనబడిన యొక దారమును తన కుడిముంజేతి కంకణమునకు ముడి వేయించుకొనెను. ప్రతిశ్రావణ శుద్ధతదియ నాడును స్నానముచేసి, యీవ్రత మాచరించి ఆదినమంతయునుపవాస ముండవలయునని వారుపదేశించిరి. ఉపవాసానంతరము యొకసత్ శ్రోత్రియభూసురోత్తముని భార్యాసహితుడై సహపంక్తి భోజనమున కాహ్వా నించవలయుననియు, వారల సమ్ముఖమున యీవ్రతమాచరించి ఆపదహారునూలుపోగు లతో పేనబడిన దారమును తన వామహస్తమున కట్టుకొనవలయుననియు, తదనంతరము విప్రవరులకు భూములు, గోవులు, సువర్ణము, ధనము, వస్త్రములు, మొదలుగా యథా శక్త్యానుసారము దానమియ్యవలయుననియు, వివాహమయిన పదహారుగురు స్త్రీలను పిలచి

నూతనవస్త్రధారణ గావించి, పసుపురాసి, గంధముపూసి, బొట్టుపెట్టి, అక్షింతలు యిచ్చి యేమైనను సుగంధఫలపుష్పవాయనములతో వారల సత్కరించవలయు ననియు, యీవ్రతము పదహారు వత్సరములు భక్తిపూర్వకముగ యెవ్వరాచరింతురో వారలకు యిహమున నైశ్వర్యమును, పరమున ముక్తియును, యొనగూడునని బోధించ యమ్మహీపతియందుల కిష్టపడి యచ్చోటనే మొదటివత్సరవ్రత మాచరించి యేకహస్తబద్ధకంకణుడై యధాక్రితిని విహారానంతరము తన మహలున కరుదెంచెను.

సువర్ణమయమైన యాతని మందిరమందు నూలుత్రాడు తన హస్తము నలంకరించి యుండుట తన ప్రథమప్రియభార్యయైన మహాదేవి విలోకించి, కుపితురాలై అత్యాగ్రహావేశపూరితమగు డెందంబున భర్తముంజేతి నూలుత్రాటిని తెంచి కిటికీనుండి క్రిందకు విసరివైచెను. రాజంతవానికి యీనూలుపోగు కర్మమేమిటని తెలియక తెంచి పారవైచెను గాని ఆమెకు దీనిమహిమ యిసుమంతయు తెలియదు. తెలిసియే యున్నచో యిట్లాచరించనే యాచరించదు గదా! గనుక యిందులకే యేకార్య మాచరించినను ఆలోచన అగత్యమని పెద్దలు చెప్పుదురు.

విసరివైచిన యానూలుదారము యెన్నియో వత్సరములై యెండి, మోడై చచ్చిపడియున్న యొక వృక్షోపరిభాగమున పడెను. స్వర్ణగౌరీవ్రత చిహ్నమగు యానూలుపోగు యెంతటి మహిమగలదో గాని దాని త్రాకినమాత్రమున పునః ప్రాణధారియై చిగిర్చి ఫలపుష్పచయములతో నెంతో కన్నులపండువుగ, శోభాయమానముగ పచ్చని నడిమివయస్సు వృక్షమై, వసంతఋతువు స్వర్ణగౌరీవ్రతసూచకమగు యానూలుపోగు ప్రభావమునకు వెరగంది ఈ యొక్క వృక్షమునకు ప్రత్యేకించి తన నిజవ్యక్తిత్వమును ప్రత్యక్షముగ యాచరణరూపముదాల్చినదా యనునట్లు నయన పర్వముగ గాననయ్యెను. ఇదియంతయు మరుగున నుండి విలోకించుచున్న యాతని ద్వితీయభార్య విశాలాక్షి యెండి మోడై మరణించిన యావృక్షముయొక్క నవీన ప్రకృతి యలంకరణమువకు సంభ్రమాశ్చర్యానందపులకితురాలై వృక్షముమీద పడిన యద్దారమును చెలికత్తెల సహాయమున తీయించి తన వామహస్తము ముంజేతి కలంకరించు

కొనెను. అగ్ని తన తత్వమును తాను వీడునా? తెలిసిముట్టుకొనినను, తెలియక ముట్టుకొనినను కాలక విడుచునా! జ్ఞాని, అజ్ఞాని; చిన్న, పెద్ద; స్త్రీ, పురుష; యౌవన, వృద్ధ; యీ విచక్షణలు దాని కవసరములేదు. దాని తత్వమునుండి యది మరలదు. అటులనే రాజు ద్వితీయభార్య యాపారవైచిన నూలుపోగు తిరిగి తెచ్చి బంధించు కొన్న మాత్రమున ఆరాజునకు మిక్కుటముగ ప్రేమాస్పదురాలై ప్రథమభార్యయందు యతని కసహ్యముగలిగించు నంత యౌవనసుందరి యాయెను. దినేదినే ద్వితీయభార్య యందు మోహప్రేమలధికమగుచుండ, ప్రథమభార్యను చూచిన భగ్గుమనునంత కోప ఘూర్ణిత హృదయుడై కడకు యాపెను తనమహలున నహితము యుంచక తరిమివైచెను.

పాపము భర్తవల్ల భవనమునుండి తరిమివేయ బడినదై మహాదేవి యడవుల సంచరించి సంచరించికడకు నేదదీర్చుకొనుటకై యొకమునిగృహము సమీపించి అందు ప్రవేశింపబోయెను గాని దుర్మార్గురాలైన యాపె వదనము చూచి చూచి యామె కెవ్వరాతిథ్య మిత్తురు? ఆమునియు రాజురీతినే యొనరించెను. దారియు డొంకయు తెలియక విచారగ్రస్తమగు చిత్తమున విపినముల సంచరించుచు నావనమధ్యమున యెట్టకేలకు గణేశ్ అను వానిని కలసికొని యాతడు ప్రశ్నించిన పైని స్వర్ణ గౌరీదేవి యెచ్చట యుండునో తెలిసికొన వెతుకుచు యీ యడవుల సంచరించు చుంటిననీ జవాబిచ్చెను. మారుజవాబు రానందున యథారీతిని యటులనే పోవంబోవ మొదట యొక మానిడితోపును, దానికి సమీపముననే యొక సరోవరమును అందున గల పద్మములచుట్టును ఆరాధించుచున్న విహంగకన్యకలను చూచి, ధన్యురాలనైతినని డెందమున యపరిమితానందము నొంది వారల సమీపించి తన నిజోదంతమునంతయు నెఱింగింప యత్నించెను. కాని పాపపూరితురాలైన యాపె మనోభీష్టమునకు వల్లెయన నయిష్టులై సరోవరముచెంతకురానీక యాటంకపఱచిరి. తాను చేసిన పాపపు కార్య మునకు ఫలితమిదియంతయు గదా యని గుర్తించి పశ్చాత్తాపము నొంది యచ్చోటనే నిర్విరపాటున నిశ్చేష్టురాలై నిలువబడి దుఃఖించుచుండెను. అంతట స్వర్ణగౌరి యాపె పశ్చాత్తాపమునకు ముదమంది తనదర్శన మిచ్చెను. మహాదేవి యాదేవిని గాంచినంతనే

సాష్టాంగనమస్కార మాచరించి తన యజ్ఞానమువల్ల చేసిన పాపకార్యమును చెప్పుకొని క్షమించి రక్షించవలయునని ప్రార్థించెను. స్వర్ణగౌరి రాజుభార్య యజ్ఞానమునచేసిన యాయకార్య కారణమువలన గలిగిన పశ్చాత్తాపమునకు మెచ్చి క్షమించి, యాశీర్వదించి యంతర్ధాన మొందెను.

అనంతరము మహాదేవి మహలున ప్రవేశించి సక్రమముగ నీవ్రత మాచరించి వెనుకటివలె భర్త ప్రేమావశంవదురాలై సంచరించెను. చంద్రప్రభ సహితము సక్రమముగ పదునారు వత్సరములును యీవ్రతమాచరించి చక్రవర్తినై కడకు అవసానమున కైలాసమునకు బోయెను. ఈవ్రత మెవ్వరు భక్తిశ్రద్ధలతో పదునారువత్సరములును యేకదీక్షగ నాచరింతురో వారల కశేషైశ్వర్యము లొనఁగూడుటే గాక అరిషడ్వర్గమును త్రుటిమాత్రమున జయింపగల శక్తిసంపన్నులై ముక్తినొందుదురనియుఁగూడ స్కాంధ పురాణమున చెప్పబడియున్నది.

## శారదాచట్టము

శ్రీమతి నడిమింటి వెంకటరత్నమ్మగారు

ఎన్నోదినాలనుండి మనహిందువులన్ గ్రసియించుచున్న యీ
పిన్నతనంపుపెండిళుల పీచమడంచి జగద్ధితంబుగా
ఇన్నిదినాలకీవు పొనరించితి, శారద ! శాసనంబు నిన్
సన్నుతిసేయగావలదె సంతతమున్ భరతాంగనామణుల్.

మాచిరకాలధర్మములు మంటను గల్పెదరే శృతిస్మృతుల్
నీచపుకార్యమిద్ది తగునేయని పల్కెడునంచుబల్కునా
పాచికమాటకారుల విపక్షులనందరి గెల్చినాడవౌ
నీచరితంబు ధన్యమగు నిక్కముగా వినుమయ్య శారదా !